## పినపాక బరిలో 18 మంది

సారపాక/మణుగూరు టౌన్, నవంబర్ 15: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పినపాక స్థానానికి 18 మంది పోటీ చేస్తున్నారు. బుధవారంతో నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. మొత్తం 25 మంది నామినేషన్లు వేశారు. మూడింటిని ఎన్నికల అధికారులు తిరస్కరించారు. నలుగురు స్వతంత్ర అభ్యర్థులు (బట్టా విజయ్‌గాంధీ, వర్సా శ్రీనివాస్, మాలోత్ సువర్ణ, పూనెం రంగయ్య) తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 18 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ ప్రకటించారు. బరిలో బీఆర్ఎస్ నుంచి రేగా కాంతారావు, కాంగ్రెస్ నుంచి పాయం వెంకటేశ్వర్లు, బీజేపీ నుంచి పొడియం బాలరాజు, బీఎస్పీ నుంచి వజ్జా సామేలు, ఆబాద్ పార్టీ నుంచి ఆలెం వెంకటేశ్వర్లు, భారత చైతన్య యువజన పార్టీ నుంచి కుంజా దుర్గ, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి గుగులోతు రమేష్, గోండ్వాన దండకారణ్య పార్టీ నుంచి వజ్జా జ్యోతి బసు, స్వతంత్ర అభ్యర్థులుగా అల్లెం నరేంద్ర(కోటి), ఊకే ముద్దరాజు, ఈసం కృష్ణ, కుంజా కృష్ణారావు, కొడెం వెంకటేశ్వర్లు, జబ్బ కృష్ణ, దుర్గ పాల్వంచ, పూనెం రాజేష్, బానోత్ జగ్గారావు, వాసం మంగయ్య ఉన్నారు.

## ఓటు హక్కుపై కళాజాత



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

బూర్గంపహాడ్, నవంబర్ 15: ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం బుధవారం బూర్గంపహాడ్‌లో కళారూపాలు ప్రదర్శించింది. తహసీల్దార్ తిరుమలాచారి పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకులు అందజేత

బూర్గంపహాడ్, నవంబర్ 15: మండలంలోని కృష్ణసాగర్ పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన నిరుపేద దంపతులు ఆదిలక్ష్మి–పాపారావుకు నెలకు సరిపడినన్ని బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కుంజా వీరభద్రమ్మ బుధవారం అందించారు. బాధ్యులు రామకృష్ణ, జైబాబు, ఎం.రమేష్, లక్ష్మయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

## ఇతరులకు ఆశ్రయం ఇవ్వొద్దు

మణుగూరు టౌన్, నవంబర్ 15: పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల లోపు ఉన్న ఇండ్ల వారు పోలింగ్ రోజున ఇతరులకు ఆశ్రయం ఇవ్వద్దని సీఐ రమాకాంత్ కోరారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లోని ఇండ్ల యజమానుల వివరాలను పోలీసులు బుధవారం సేకరించారు. పోలీస్ సిబ్బందికి సీఐ సూచనలు చేశారు.

## 'కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా'

మణుగూరుటౌన్, నవంబర్ 15: సింగరేణి మణుగూరు ఏరియాలోని కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కరిస్తానని టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు వూకంటి ప్రభాకర్‌రావు హామీ ఇచ్చారు. ఆయన బుధవారం ఏరియాలోని కేసీహెచ్‌పీని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. నాయకులు రామారావు, బాలాజీ, డీవీ ప్రవీణ్, మోహన్, రెడ్డి, నాగభూషణ్, లింగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

మణుగూరు టౌన్, నవంబర్ 15: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మణుగూరు పోలీసులు వాహనాలు ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. మండలంలోని తోగ్గూడెం గ్రామంలో బుధవారం తనిఖీ చేశారు.ఫోటో ఫైల్‌నేమ్ః 15ఎస్‌పీకే01ః వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై నాగభిక్షం

సారపాక, నవంబర్ 15: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఎస్సై నాగభిక్షం, సిబ్బంది కలిసి బుధవారం వాహనాలను తనిఖీ చేశారు.

## 'ఉన్నతి' అమలు పరిశీలన

సారపాక, నవంబర్ 15: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 'ఉన్నతి' కార్యక్రమం అమలును అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందించింది.

## అయ్యప్ప ఆలయంలో అన్నదానం

పాల్వంచ, నవంబర్ 15 : పాల్వంచ పట్టణంలోని ప్రముఖ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం నిత్యాన్నదానం ప్రారంభించారు. ప్రతి ఏడాది ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్నారు. బుధవారం నుంచి రోజుకు 500మంది మాలధారణ చేసిన భక్తులకు అన్నదానం చేస్తారు. ఆలయ కమిటీ సభ్యులు బి.శ్రీనివాస్, కనగాల రాంబాబు గురుస్వామి, వెంబడి సత్యం, బీఎన్ చారి, బేతంశెట్టి వెంకటస్వామి, చెరుకూరి శేఖర్, స్వామి, నాగేంద్రస్వామి పాల్గొన్నారు.



మణుగూరు టౌన్: పార్టీలో చేరిన వారితో రేగా కాంతారావు

## నియోజకవర్గ ప్రజలే బలగం..

# బీఆర్ఎస్ శ్రేణులే బలం

మణుగూరు టౌన్, నవంబర్ 15: ''నియోజకవర్గ ప్రజలే నా బలగం. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులే నా బలం'' అని, బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు అన్నారు. అశ్వాపురం మండలంలోని కళ్యాణపురం, రామచంద్రాపురం, బట్టీల గుంపు గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన 100 కుటుంబాల వారు రేగా కాంతారావు సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ స్థానిక కార్యాలయంలో ఈ కార్యక్రమంలో వారికి రేగా గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీలో చేరిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన బీఆర్ఎస్‌కు ప్రజలు మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలపై ప్రజలతో చర్చించాలని, గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని వివరించాలని కోరారు. సీఎం కేసీఆర్ సహకారంతో నియోజకవర్గాన్ని మరింత ప్రగతి పథంలోకి తీసుకెళ్తానని అన్నారు.

### విస్తృత ప్రచారం

పినపాక, నవంబర్ 15: మండలంలో బీఆర్ఎస్ ప్రచార హోరు కొనసాగుతున్నది. రేగా కాంతారావును గెలిపించాలని కోరుతూ భద్రాచలానికి చెందిన తూచిక ప్రకాశ్ బైక్‌పై మండలంలోని మల్లారం, జానంపేట, ఏడూళ్లబయ్యారం, రావిగూడెం ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలో ప్రచారం చేశారు.

మణుగూరు టౌన్, నవంబర్ 15: రేగా కాంతారావు గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణంలోని రాజుపేట, కుమ్మరిబజార్, గాంధీ బొమ్మ సెంటర్ ఏరియాల్లో వట్టం రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఇంటింటి ప్రచారంలో బానోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు**


పినపాక: ప్రచారం చేస్తున్న తూచిక ప్రకాశ్

మణుగూరు టౌన్, నవంబర్ 15: బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను పార్టీ స్థానిక కార్యాలయంలో బుధవారం రేగా కాంతారావు ఆవిష్కరించారు. నాయకుడు యాకూబ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం, అక్టోబర్ 15: మండలంలో బుధవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య, నాయకులు గుడ్ల రంజిత్ కుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకే ఓటేయాలని కోరారు.


### రేగా పరామర్శ

అశ్వాపురం, నవంబర్ 15: మండలంలోని మిట్టగూడెం గ్రామస్తుడు వేమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని రేగా కాంతారావు బుధవారం పరామర్శించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.


మణుగూరు టౌన్: రాజుపేట గ్రామంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


మణుగూరు టౌన్: బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ఆవిష్కరిస్తున్న రేగా కాంతారావు


కరకగూడెం: ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


అశ్వాపురం: వేమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రేగా

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

జూలూరుపాడు, నవంబర్ 15 : మండల కేంద్రంలో పోలీసులు బుధవారం లాంగ్‌మార్చ్ నిర్వహించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా నిర్వహించాలని సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలు

దుమ్ముగూడెం, నవంబర్ 15 : మండల పరిధిలోని తూరుబాక గ్రామశివారులో భద్రాచలం నుంచి సత్యనారాయణపురం వైపు బైక్‌పై వస్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాల పాలయ్యాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న జడ్పీటీసీ తెల్లం సీతమ్మ చూసి ఆ వ్యక్తిని ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కు ఫోన్‌చేశారు. వాహనం వచ్చేవరకు ఉండి గాయపడిన వ్యక్తిని ఈ అంబులెన్స్‌లో భద్రాచలం ఆసుపత్రికి తరలించారు.

## బాలల దినోత్సవం

దమ్మపేట, నవంబర్ 15: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు స్వయం పాలన నిర్వహించారు. ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. వీరిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.